
# ప్రేమకు నిర్వచనం



ఎం. వి. రమణ

అది చల్లని సాయంత్రంవేళ. పగలంతా తన ప్రతాపం చూపించిన భాస్కరుడు మెల్లిగా తన గూటిని చేరుకోబోతున్నాడు. అందమైన పార్కు జనంతో కలకలలాడుతోంది. అంతవరకు తాపంతో అల్లాడిపోయిన ప్రజలు చల్లగాలిని హాయిగా పీల్చుకునే ఉద్దేశంతో ఒత్తయిన పచ్చ గడ్డితో, కనులకింపైన పూలచెట్లతో, విశాలమైన ఛాయని ప్రసాదించే వృక్షాలతో సేదదీర్చే ఆ పార్కులో తనివితీరా కాలం గడుపుతున్నారు.

అందులో ఒక పక్కగా ఉన్న సిమెంటు బెంచిపై ఇద్దరు వయసుమళ్ళిన వ్యక్తులు కూర్చుని వచ్చిపోయే ప్రజలని గమనిస్తున్నారు. వారిద్దరికీ రెండేళ్ళుగా క్రమంతప్పని దినచర్య అది. అయిదు గంటలకి చేతికర్రలతో ఇద్దరూ అక్కడ చేరుకుని ఒక రెండుగంటలపాటు కబుర్లతో ప్రపంచాన్నంతా చుట్టి మెల్లిగా స్వస్థానాలకి బయలుదేరతారు.

వెంకట్రామయ్య దీర్ఘంగా నిట్టూర్చేడు. ఎందుకన్నట్లు చూశాడు జగన్నాధం. మెల్లిగా గొంతుసవరించుకుని "ఇన్నేళ్ళుగా కాపరం చేస్తున్నా హఠాత్తుగా ఈరోజొక సందేహం కలిగిందోయి, జగన్నాధం. అసలు ప్రేమంటే ఏమిటంటావు?" అని ప్రశ్నించేడు.

మిత్రుని ప్రశ్నకి జగన్నాధం ఎంతో ఆశ్చర్యపోయాడు. "ఏమిటో ఇంతకాలం వర్షంలాగ జీవితం ఎళ్ళమార్చివేసుకునే ఈ వయసులో నీకు ప్రేమసంగతులెందుకు కావలసివచ్చిందోయ్?" ఆశ్చ

రక్యంగా ఉండే. ఏ కామినయినా ఈ తాత గారిమనసును దోచుకుని మత్తెక్కించిందా ఏమిటి" అన్నాను మందహాసంతో.

వెంకట్రామయ్య తడబడ్డాడు. "అబ్బెబ్బే. అదేమీ కాదులేవోయ్. అలాకాదు నేను ఏకు వరి చెప్పలేకపోయాను కాబోలు ఈ మధ్య ఏం జరిగిందంటే-మా పక్కవాటా రెండుగదుల్ని ఒక పడుచు జంటకి అద్దెకిచ్చేంతా వాళ్లు పాపం ఎంతో ఆప్యాయంగా అభిమానాన్ని కురిపిస్తూ మాపిల్లలెవరూ దగ్గరలేని లోటు తీరుస్తూనే ఉన్నారు.


కాని మా ఆవిడకి మాత్రం గొప్ప కష్టం వచ్చిపడింది. వాళ్లేమో నూతన దంపతులు. కొత్తమోజులో ఉన్నవారు. ఇంట్లో వేరే ప్రాణి ఎవరూ లేదేమో, ఇక వాళ్లకి ఇరవైనాలుగు గంటలూ వసంత ఋతువే. చిలిపికయ్యాలు కొంటె చేష్టలు, సరసపల్లాపాలు-ఇంత చూసుకో మా ముసలావిడ గంగవెర్రులెత్తిపోతోంది.

"నిన్న పొద్దున కరివేపాకు కోసం పెరట్లోకి వెళ్లిందా, వాళ్ల స్నానాలగది పక్కనే ఉందిలే చెట్టు-లోపలినించి ఇద్దరి గుసగుసలూ వినపడ్డాయిట. అంతే, ఆ పట్టున పరిగెత్తుకొచ్చేసి ఇంకా నిద్ర మంచం మీదనుంచి లేవని నన్ను గట్టిగా కుదిపి లేపేసింది. ఏ పాము చొరబడిందేమో నన్నంత హడావిడిగా లేస్తే గొంతు తగ్గించి ఆవిడ చెప్పే రహస్యం ఇంతకీ ఇదన్నమాట. 'ఇద్దరూ కలిసే స్నానం చేస్తున్నారండీ' అంటుంది కళ్లు పెద్దవి చేసుకుని. 'పోనీ పదవే మనమూ చేద్దాం సరిగంగ స్నానాలు' అన్నాను ఎంతో రసికత్వంతో. మూతి తిప్పుకుని వెళ్లిపోయింది.

"తర్వాత నేను అన్నం తింటుంటే కుజంమీద పొడిచి సైగచేస్తోంది. నా కర్థమే కాలేదు, తనే చెప్పింది. 'ఆ కబుర్లు వినండి ఎంత సరదాగా ఉన్నారో. భోంచేస్తున్నారు లాగుంది. ఒక కంచమే తోముతుదండీ ప్రతిపూట. ఒక దాంట్లో నే తింటారు కాబోలు.' అంది తన్మయత్వంతో."

"నువ్వుకూడాఒక కంచమే తోము తావుగా' అన్నాను నవ్వొచ్చి. రోజూ నేను తిన్నాక అదే కంచంలో తింటుందిలే పాపం అవిడ ఎక్కడా ఈ లోకంలో లేదు ఆ మాట వినడానికి. చెవులురిక్కించి గోడ అవతలనించి వాళ్ల మాటలేమైనా వినిపిస్తాయేమోనని మహా తలకిందులయి పోతోంది.

"రాత్రికూడా అదే ధ్యాస. రోజూ వాళ్లిద్దరూ తిరగడానికి వెళ్తూనే ఉంటారుట. రోజూ అతగాడు మల్లెపూలు తెచ్చి ఆమె జడలో తనే స్వయంగా పెడతాడట. ఆమె కెలా తెలుసని అడగకు. వాళ్లిద్దరి విషయాలు అన్నీ ఆమెకి తెలిసిపోతాయి. రోజూ తాంబూలం వేసుకుంటారుట. ఇవన్నీ చెప్పి ఆఖరికి తేల్చిన ముక్కేమిటో తెలుసా 'అతనికి ఆ పిల్లంటే



ఎంత ప్రేమో చూశారా. మీరూ ఉన్నారు ఎందుకు. 'నేనంటే ప్రేమే లేదు' అని కళ్ళ నీళ్ళు పెట్టుకుందోయి. ఒట్టు నిజంగానే ఏడ్చింది–నలభై ఏళ్ళుగా నాతో సంసారం చేసిన నా సహధర్మచారిణి!" ఒక్క–క్షణం ఆగేడు వెంకట్రామయ్య.

"ఈ వేళ పొద్దున్నకూడా ఇదే భాగోతం. నాకేమీ దిక్కు– తోచడంలేదు. 'నువ్వంటే నాకు ప్రేమనే అమ్మి అశీ' హామీ ఇద్దామంటే నాకు ప్రేమంటే ఏమిటో తెలిసి చావడంలేదు. ఆవిడ తప్ప నాకు వేరే లోకమే లేనిమాట నిజమే. కాని ప్రేమ అంటే అలాగే ఉంటుందా? నాకేమీ అర్థం కావటంలేదు." నిట్టూర్చేడు.

సాలోచనగా తలపంకించేడు జగన్నాధం. రెండుమూడు నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి. నెమ్మదిగా జగన్నాధమే ప్రారంభించాడు. "ప్రేమ అనేది ఒక చిక్కు– ప్రశ్న అనుకుంటాను. నా ఉద్దేశంలో, ప్రేమించాను అని చెప్పుకునే ఏ వ్యక్తికీ కూడా ప్రేమ యొక్క– సంపూర్ణస్వరూపం అర్థమయి ఉంటుం

దనుకొన్నాను. అది ఒక ఉదాత్తమైన భావం. పిల్లతెమ్మెరలోని చల్లదనంలాగ, మంచి గంధంలోని సువాసనలాగ అది కంటికి కనిపించనిది, మనసుని ఆహ్లాదపరిచేది. క్షణికమైన శారీరక వ్యామోహానికి, కలిసి జీవించిన గుర్తుగా ఏర్పడిన సన్నిహితత్వానికి ప్రేమ అని పేరుపెట్టి మనుష్యులు తమని తామే మోసంచేసుకుంటున్నారు. నూటికి తొంభైతొమ్మిది మంది ప్రేమ అంటే ఏమిటో తెలుసుకోకుండానే ఆ పదాన్ని వాడుతున్నారు. పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. పిల్లల్ని కంటున్నారు చివరికి రాలిపోతున్నారు .."

"నువ్వు ఆ మిగిలిన ఒక్క శాతంలోకి వచ్చే అదృష్టవంతుడి నంటావు" కుతూహలంగా అడిగేడు వెంకట్రామయ్య.

విషాదంగా నవ్వేడు జగన్నాధం. "భార్యని పోగొట్టుకుని నలభై ఏళ్లుగా ఏకాకిజీవితం గడుపుతున్న నేను అదృష్టవంతుడిని ఎలాగవుతాను?"

జాలిగా చూశాడు వెంకట్రామయ్య. జగన్నాధానికి రెండుమూడేళ్ల దాంపత్య జీవితంలో పిల్లలుకూడా పుట్టలేదని, చిన్నప్పటినించి చేరదీసి పెంచిన మేనల్లుడి దగ్గర శేషజీవితాన్ని గడుపుతున్నాడని తప్ప అతని వ్యక్తిగత విషయాలింకేమీ తెలియవు. అతను గతించిన భార్య గురించి ఎప్పుడూ మాట్లాడడు.

ఆ రోజు అలవాటుకి విరుద్ధంగా స్నేహితుడితో అన్నాడు. "నీ ప్రశ్న నాలో గతస్మృతుల్ని రేకెత్తిస్తోందోయి. ఒకనాడు నేను కూడా గాఢంగా ప్రేమించాననుకున్నాను. తర్వాత ఇంకా మహత్తరమైన ప్రేమని చూడగలిగేననుకున్నాను. కాని-కాలగర్భంలో అన్నీ కరిగిపోయి ప్రేమ ఉనికినే సందేహించే స్థాయికి చేరుకున్నాను. నా జీవిత గాథ వింటావా నీ సందేహం తీరుతుందేమో.

"నాకు ఇరవై ఏళ్ల వయసులో వివాహమయింది. సాంప్రదాయకమైన కుటుంబంలోంచి లక్షణమైన పిల్లని చూసి మా వాళ్లు నా కప్పగించేరు. నేను చెప్తే నమ్మవేమో కాని నా భార్య అందాలరాశి. ముట్టుకుంటే మాసిపోతుందేమోననిపించే దంతపు బొమ్మ. విశాలమైన ఆమె కళ్లలో నా నీడ చూసుకోవాలని, నున్నటి ఆమె చెక్కిళ్లని తనివితీరా స్పృశించాలని, కోమలమైన ఆ హస్తద్వయం నా మెడని చుట్టుకోవాలని ఎన్నెన్నో కలలు కన్నాను, ఇది ప్రేమేనంటావా? కాదేమో కదూ, భౌతికమైన వాంఛ ప్రేమ ఎలాగౌతుంది?

"కాని మొదటి రాత్రే నన్ను నిరాశతో కృంగిపోయేలా చేసిందోయి ఆ అపరంజి బొమ్మ. రెండు చేతులు ఎత్తి నాకు దణ్ణం పెట్టి 'నా మనసు ఇదివరకే ఒకరికి అర్పించాను. మనసులేని శరీరమే మీకు కావాలనుకుంటే మీయిష్టం. కాని నా శరీరం మైలపడిన మరుక్షణం పెరట్లో బావిలో తేలుతుంది.' అని పలికింది దృఢంగా.

నా నరనాడులూ కృంగిపోయాయి.

ఇంతకంటే ఘోరమైన ఎదురుదెబ్బఇంకేముంటుంది? బలప్రయోగానికి నా మనసంగీకరించలేదు. ఆమెకి నేనంటే ఎటువంటి అభిప్రాయమైనా ఉండనీ, నాకు మాత్రం ఆమె దేవుడిచ్చిన అపురూపమైన కానుక. నా మనసులో ఆమె తప్ప వేరే మరెవరి రూపమూ ప్రతిష్ఠించలేదు కదా. నా హృదయపీఠం ఎప్పుడూ ఆమెదే. ఆమె ఎప్పటికైనా మనసు మార్చుకుంటే తప్ప నాకుగా నేను ఆమెని తాకదల్చుకోలేదు.

"చిత్రంగా నాకు ఆ క్షణంలో ఆమెపై కోపం రాలేదు. ఆ అపరిచితురాలిపై అసూయకూడా కలగలేదు నా మనసు అదోకరకంగా స్తంభించిపోయింది. పైగా ఆమె అంటే జాలికూడా ఏర్పడసాగింది. పాపం ఇష్టంలేని పెళ్లి చేసుకుని ఎంతగా వ్యధపడుతోందో అనిపించింది. ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నాను ఏ విధంగానూ ఆమె మనసు నొప్పించేలాగ ప్రవర్తించకూడదని. ఆమె నెంతో అపురూపంగా చూసుకోవాలని నా మనసు తహతహలాడింది. ఇది ప్రేమ కాదంటావా?

"తర్వాత మా ఇంటికి వచ్చేకకూడా ఇదే వరస. మా యింట్లో బలగమెక్కువ. వయసుమళ్లిన మా పితామహులు, నా తలిదండ్రులు. పయసొచ్చిన చెల్లెళ్లు, చదువుకుంటున్న తమ్ముళ్లు. అడపదడప వచ్చిపోయే అక్కలు, బావలు, ఇంకా బంధుజనులు, నౌకర్లు, చాకర్లు ఆమె అనతికాలంలోనే ఈ బాధ్యతలన్నిటినీ నెత్తిన వేసుకుని అవలీలగా కుటుంబ భారాన్ని మోయసాగింది. ఎవరిచేతా వేలెత్తి చూపించుకోకుండా సమర్థురాలన్న పేరు తెచ్చుకుంది.

"మా పడకగదిలో ఒకటే పందిరి మంచం ఉండేది. రెండో మంచం వేయమంటే ఎవరైనా చెవులు కొరుక్కుంటారేమోనన్న అనుమానం. దాని మీదే అటు తిరిగి ఆమె, ఇటుతిరిగి నేను అసిధారావ్రతంలాగ గడిపేము. రెండు మూడు నెలలు మహా దుర్భరంగా ఉండేదిలే కాని మరచెంబుతో మంచినీళ్లు తెచ్చి తలుపు గడియవేసి ఇటు తిరిగిన ఆమె కళ్లలో భయాందోళనలు చూడగానే కళ్లుమూసుకుని పక్కకు తిరిగిపోయేవాడిని. ఆమె తేలికగా నిట్టూర్పు విడవడం స్పష్టంగా తెలిసేది. మీ పక్కవాటాలో నవజంట వాది ప్రేమ కాదంటారేమో కాదూ.

"ఒకసారి, మా పెళ్లయిన రెండేళ్లకనుకుంటాను ఏదో పండక్కి అత్తవారింటికి వెళ్లేము. భోజనం చేసి ఎండవేళ విశ్రమిద్దామని కళ్లుమూసుకుని పడుకున్నాను. గదికిటికీ పక్కనే వరండాలో నించి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. విందామన్న ఆసక్తి లేకపోయినా నా చెవులలా పడుతూనే ఉన్నాయి

నా భార్య అడుగుతోంది కుతూ

హాల్ంగా. "అయితే భానూ. ఈ మధ్య భాస్కరం ఎక్కడైనా కనిపించాడే. ఏంచేస్తున్నాడు? ఎలాగున్నాడు?"

అతగాడి పేరు భాస్కరమన్నది కూడా నాకు అంతవరకు తెలియదు విషయ మేమిటో తెలియక ఆసక్తిగా వినసాగేను.

ఇంకొక అపరిచితకంఠం అంటోంది. "అతనికి నువ్వు ఎక్కడగుర్తుంటావులే. ఈ మధ్యనే పెళ్ళయింది కదా, ఇప్పుడు ఆవిడకి వేవిళ్ళు." ఇంకొంచెం గొంతు తగ్గించి "పెళ్ళి ఆయాక ఆవిడ బయట చేరనేలేదుట. భాస్కరం ఎంత మురిసి పోతున్నాడని." అంది.

"ఆనాటి రాత్రి నిజంగా మరుపురాని రాత్రి. తెల్ల చీరతో, తలలో మల్లెలతో అప్సరసలాగా వచ్చి పిలిచింది ఆమె. లోకంకోసం ఇలాంటి నాటకాలు మా కలవాటే కాబట్టి నాకేమీ వింతనిపించ లేదు మామూలుగా పక్కకి తిరిగి పడుకున్నాను.

ఇంతలో కాళ్ళమీద మెత్తని స్పర్శ. ఉలిక్కిపడి చూద్దును గదా, నా ధర్మపత్ని మెల్లిగా కాళ్లు ఒత్తుతోంది ఇదేమిటీ వైపరీత్యం అని ఆశ్చర్యపోయి లేచి కూర్చున్నాను. మధ్యాహ్నం విన్న సంభాషణ నా మదిలో మెదిలింది. చాలా రోజులకి మనసిచ్చినవాని కబురు- అది కూడా శుభవార్త విన్నందుకు నా అంచనా ప్రకారం ఆమె ఆనందంతో పొంగి పోతుండాలి. కాని ఆమె ముఖంలో సంతోషఛాయలే లేవు. కొన్నిగంటలుగా ఏడుస్తున్నందుకు నిదర్శనంగా ముఖ మంతా ఎర్రబడి, కళ్లు మంకెన పువ్వుల్లాగున్నాయి.


హఠాత్తుగా నా పాదాలమీద వాలి పోయి "నన్ను క్షమించండి. ఇన్నాళ్లు మిమ్మల్ని బాధపెట్టేను. నా పాపానికి నిష్కృతి లేదు" అంటూ వెక్కివెక్కి పడటం మొదలుపెట్టింది. అప్పుడు నేనేంచేసానో తెలుసా?" ప్రశ్నార్థకంగా స్నేహితుని వైపు చూశాడు జగన్నాథం.

వెంకట్రామయ్య ముసిముసిగా నవ్వేడు. "ఇంకేముంది, నా జన్మ తరించింది కదా అని పొంగిపోయి వుంటావు."

తల అడ్డంగా తిప్పేడు జగన్నాథం. "నా కసలు ఏమీఅనిపించలేదు. అంతకు ముందు ఆ మాటలు వినకపోతే అలాగే అనుకునేవాడినేమో. కాని భాస్కరం భార్యకి వేవిళ్లన్న వర్తమానానికి నా భార్య హఠాత్తుగా చూపించిన అవ్యాజ మైన ప్రేమకీ గల సంబంధాన్ని గురించి ఆలోచించగా నాకు- అసహ్యంవేసింది."

కంగు తిన్నట్లయింది వెంకట్రామయ్యకి. నోరు తెరుచుకుని చూస్తుండి పోయేడు మిత్రుని వంక.

"నిజంగానే, నా కసలు ఆమెని తాక బుద్ధి కూడా కాలేదు. అలాగే మూడు నాలుగు వారాలు గడిచిపోయేయి. ఒక నాటి రాత్రి ఆమె నాతో పెద్ద తగువు




పెట్టుకుని కూర్చుంది. ఆమెని నేను అన్యాయంగా శిక్షిస్తున్నానట. చూశావా. ఇన్నిరోజులు నేరంలేని శిక్ష అనుభవించింది నేను. ఆమెకి నా వరస ఏమీ నచ్చలేదంది. ఇంకా ఏమేమో అంది. ఎవరికి నేను మగవాడినే కాదంది. ఊళ్లో అందరూ పెళ్లయి ఏడాది కాకుండానే పిల్లతల్లులవుతుంటే తన కొక్కదానికే ఆ అదృష్టం లేకపోయింది అని ఎంతగానో వగచింది.

"నాకు నిజంగానే ఒళ్లుమండిపోయింది. అన్నాళ్లు ఏ విధమైన అధికారమూ చూపించకుండా ఆమెని అంతగా ఆరాధించి ఆమె మనసు కనుగుణంగా నడుచుకున్న నేను అంతలోనే ఎందుకూ పనికిరానివాడి నయిపోయా నన్నమాట. కాని నా మనసులో ఏమూలో ఆమెపై ఉన్న అపరిమితమైన అభిమానం నన్ను మాట్లాడనీయలేదు.

అలా అర్ధరాత్రివరకు నన్ను అది పోసుకుంటూనే ఉంది. మరునటిరోజు చెరువుకి బిందెతో వెళ్లిన ఆమె కాలు జారి కొట్టుకుపోయిందన్నారు. రెండు రోజులకి కాని శరీరంకూడా దొరకలేదు. నా ఉద్దేశం ఖచ్చితంగా ఆమె కావాలనే జలప్రవేశం చేసివుంటుంది. అంతటితో నా ప్రేమకథ సమాప్తం." అని ఆగేడు.

"తర్వాత నిన్ను మళ్లీ పెళ్లిచేసుకో మనలేదా ఎవరూ? ఆమె మరణం నిన్నంతగా కదిలించి ఒంటరిగా మిగిల్చిందా?"

ఒక నిమిషం జగన్నాధం మాట్లాడలేదు. తర్వాత మెల్లిగా తనకి తానే చెప్పుకుంటున్నట్లు ప్రారంభించాడు.

"కదిలించిందా? అవును, ఆమె మరణం నన్ను తీవ్రంగానే కదిలించింది. కానీ నువ్వనుకున్నట్లు కాదు. నిజంచెప్పనా, ఆమె మరణంతో నా ప్రేమ పూర్తిగా నశించింది. ఆమెమీద ఆనాటి రాత్రి మొట్టమొదటిసారిగా కలిగిన అసహ్యం రెండింతలైంది. అది క్రమంగా స్త్రీజాతి పైనే ద్వేషంగా, సంసారమంటే విరక్తిగా మారి మావాళ్లు ఎంత పోరినా మళ్లీ వివాహేచ్ఛ కలుగలేదు. ఇప్పటికి కూడా వాళ్లు ఆమె పేరు ఉచ్చరించాలంటే కూడా ఇష్టం ఉండదు. అదంతా ఆమెమీద ఉన్న అనురాగమనుకుంటారు అందరూను. వాళ్ల దృష్టిలో నేను భగ్నహృదయుడిని. కలిసి కాపురంచేసింది రెండేళ్లే అయినా ఆమె స్మృతికే జీవితం అంకితం చేసిన త్యాగమూర్తిని." గట్టిగా నవ్వేడు జగన్నాథం.

వెంకట్రామయ్యకి ఏమని జవాబు చెప్పాలో అర్థంకావడంలేదు మౌనంగా చూస్తూ కూర్చున్నాడు స్నేహితుని హృదయపు లోతుల్ని అంచనావేస్తూ.

మళ్లీ ప్రారంభించేడు జగన్నాథం. "ప్రేమంటే ఏమిటన్నావు కదూ? నువ్వు చెప్పు ఆమెది అసలైన ప్రేమేనా? ప్రేమ అంటే అదొక దివ్యమైన భావం. ప్రేమించినవారి కాలిలో ముల్లుదిగితే మన కళ్లు నీరు కార్చాలి. వారి హృదయం బరువెక్కితే మనకి దిక్కుతోచక పోవాలి. వారి చిరునవ్వులు మనకి ఉత్తేజాన్ని కలిగించాలి. వారి సుఖశాంతులే మనకి ఆనందదాయకాలవాలి.

"ఆమె విషయం తీసుకో. అతగాడు పెళ్లి చేసుకుని తండ్రి అవుతుంటే విచార మెందుకు? తనలాగ మోడువారిన బ్రతుకు కాకుండా అతనిది చిగురిస్తున్నందుకు హర్షించాలి కదా. తనేమో మనసు సరిపెట్టుకోలేకపోయింది కాని అతనుకూడా అలాగే ఉండాలని ఆమె కోరికా? అతని భార్యతో సమంగా పంత మెందుకు? ముందుగా పెళ్లి చేసుకుని అతని హృదయాన్ని కాలరాచింది తనే కదా లోకం దృష్టిలో హాయిగా కాపురం చేసుకుంటున్న మహాసాధ్వి, ఉత్తమ యిల్లాలు కదా! తన జ్ఞాపకాలతో అతను పిచ్చివాడైతే ఆమె సంతోషించేదా? ఏ ఉద్దేశంతో ఆమె నన్ను దూరంగా ఉంచింది? అతనిమీద ప్రేమవల్లనే కదా. నాచెంత చేరిందంటే దానికర్థం ఆ ప్రేమ మరణించిందనే కదా. ఎందుకని? అతను బిడ్డల్ని కంటున్నాడనా? విచిత్రంగా లేదూ!"

ఒక నిమిషం ఆగి మళ్లీ అన్నాడు. "నాకు అసహ్యంవేసిందన్నాను కదూ. అవును భౌతికమైన కోరికలకి, ప్రేమకి ముడిపెట్టడం ఎంత వెర్రితనం! అతను భార్యతో సంసారం సాగిస్తున్నాడని తెలియగానే అతని మీద ప్రేమని నా మీదకి మళ్లించ దలచుకుందన్నమాట. ఒకరకంగా ఆమెకంటే నాదే గొప్ప

ప్రేమ. అంతవరకు ఆమె నెంతో ప్రేమించాను, ఆమె హృదయంలో నేను లేనని తెలిసికూడా ఆరాధించేను. ఏనాడూ ఆమెను పరుషవాక్యా లనలేదు. ఆమె అభీష్టప్రకారమే నడుచుకున్నాను. నా వాంఛలను అణుచుకోవడం కూడా కాదు, ఆమెకి నామీద వ్యామోహం లేదని తెలిశాక అసలు వాంఛించనే లేదు. ద్వేషాన్ని కూడా పెంచుకోలేదు. సాటి మనిషిగా ఆమెని అర్థంచేసుకుని జాలి పడ్డాను. సాధ్యమైనంతవరకు ఆమెని సంతోషపెట్టడమే నా కర్తవ్యం అను కున్నాను. నేను దరిచేరకపోవడమే ఆమెకి శాంతినిస్తుందని గ్రహించి దూరంగానే ఉన్నాను. మరి ఈకాలం వాళ్లు దీన్ని ప్రేమ అంటారో అనరో!

"కానీ అంతా కరిగిపోయింది. ఆమెకి ప్రేమించే హృదయం లేదు. ప్రేమ బలిని కోరుకోదు. ద్వేషాన్ని, కసిని పెంచదు. ప్రతిఫలవాంఛ లేనిది నిస్సరైన ప్రేమ. ఆమె తిరస్కారం మీద కసితీర్చు కోవడానికి నే నెందుకు ఆయుధాన్ని కావాలి? ఆమె పశ్చాత్తాపమే నాకు అస హ్యాన్ని కలిగించింది. అలా కాకుండా ఆమె శేషజీవితం ముందులాగే గడిపితే నేనూ ప్రేమిస్తూనే ఉండేవాడినేమో.

"ఆమె మరణం మరింత ఘోరం చూడు. చేతులారా నిండుప్రాణాన్ని తీసు కునే మనస్థైర్యమే ఆమెకుంటే ఆ పని వివాహానికి పూర్వమే చేసివుండవలసింది. నా జీవితంతో ఎందుకు ఆడుకున్నట్లు? ఒకవాడు నేనామెని తాకితేనే ప్రాణంతీసు కుంటానని బీరాలు పలికిన ఆమె నా తిరస్కృతి కారణంగా జీవితాన్ని అంతంచేసుకోవడం హాస్యాస్పదంగా లేదూ? ఆమెకి నేనంటే ప్రేమలేదు కదా అంతవరకు నే నెక్కడ బల ప్రయోగం చేస్తానోనని దినదిన గండంగా తలచిన ఆమె నేను స్వీకరించకపోతే జీవితమే వ్యర్థమని ఎందుకు తలచిం సిందో నా కిప్పటికీ అర్థంకాదు. ఆమె ప్రేమకి ఎలా నిర్వచనం చెప్పుకోవా లంటావు?" దీర్ఘంగా నిట్టూర్చేడు జగన్నాథం.

"నువ్వు చెప్పింది నిజం జగన్నాథం. ప్రేమ ఒక చిక్కుప్రశ్న. అది అయో మయం, అగాధం," అనిర్వచనీయం గంభీరంగా అన్నాడు వెంకట్రామయ్య.

---